ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం 7 సెప్టెంబరు 2025

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- ఉత్తమ టీచర్లకు అవార్డుల ప్రదానం



అవార్డులు పొందిన ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్ది వారిని ప్రాయోజకులు చేయడంలో ఉపాధ్యాయులు చేసే కృషి ప్రశంసనీయమన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో శనివారం జరిగిన గురుపూజోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 33 మందికి కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి అవార్డులు ప్రదానం చేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రుల తరువాతి స్థానం గురువులదేనని కొనియాడారు. కాలానికి అనుగుణంగా విద్యారంగంలో మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రానున్న రోజుల్లో ఉపాధ్యాయులను విదేశాలకు పంపి ఆధునిక విద్యా విధానాలపై అధ్యయనం చేయించి, అందుకు అనుగుణంగా రాష్ట్రంలో బోధనను అందించాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 11వేల ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టి, పెండింగ్‌లో ఉన్న పదోన్నతులకు శ్రీకారం చుట్టామని అన్నారు. రానున్న రోజుల్లో విద్యార్థులకు వాహనాలు ఏర్పాటుచేసి ఉచిత రవాణా సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. సర్కారు పాఠశాలల్లో సీటు కావాలనే పరిస్థితి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలను కల్పనకు సీఎస్ఆర్, సీడీపీ, డీఎంఎఫ్‌టీ నిధులను వినియోగిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా అందించే బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

'రైతులను తప్పుదోవపట్టిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ నేతలు'

కాటారం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీ విధానంపై కనీస అవగాహన లేకుండా బీజేపీ రాష్ట్ర నేత చల్ల నారాయణరెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు రైతులను రెచ్చగొడుతూ తప్పుదోవపట్టిస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు అంగోత్ సుగుణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజ కవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వంశవర్ధన్‌రావు, మండల అధ్యక్షురాలు జాడి మహేశ్వరి ఆరోపించారు. మండల కేంద్రంలో వారు విలేకరులతో శనివారం మాట్లాడారు. యూరియాను కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రాలకు సరఫరా చేస్తారని, వచ్చిన యూరియాను వివిధ ఏజెన్సీల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పంపిణీ చేస్తోందని అన్నారు. యూరియా కొరత ఉందని, ఆపరేషన్ సింధూర్‌తో పంపిణీలో కొంత జాప్యం ఏర్పడిందని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు చెబుతుండగా ఆ పార్టీ స్థానిక నాయకులు మంత్రి శ్రీధర్‌బాబును విమర్శించడం దారుణమన్నారు. ఈ సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి కుంభం స్వప్న, కాంగ్రెస్ నాయకులు రమేష్‌రెడ్డి, కొట్టె ప్రభాకర్, అజీజ్, తిరుపతి రెడ్డి, చీమల రాజు, కొట్టె శ్రీహరి, మంత్రి నరేష్, జాడి రమేష్, మంత్రి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు రాక.. పూట గడవక..

అవస్థల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

- మాడల్ స్కూల్‌లో ఏడు నెలలుగా రాని వేతనాలు
- పంచాయతీరాజ్‌లో 5 నెలలుగా పెండింగ్
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెలల తరబడి ఎదురుచూపులు
- అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ ఇదే పరిస్థితి
- బడ్జెట్ కేటాయింపుల్లో సర్కారు నిర్లక్ష్యం
- నిధులు వచ్చినా జీతాలు చెల్లించని ఏజెన్సీలు
- ఏజెన్సీలను రెన్యూవల్ చేయడంలో కలెక్టర్ల జాప్యం
- ఉమ్మడి జిల్లాలో 24వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు



హనుమకొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అవుట్ సోర్సింగ్ (పొరుగు సేవలు) ఉద్యోగులు ప్రతీ నెల వేతనాల కోసం వేయి కళ్లతో ఎదురుచూడాల్సి వస్తోంది. ఏ నెల కూడా వారికి సక్రమంగా జీతాలు అందడం లేదు. ఏడెనిమిది నెలలైనా వేతనలు రాక నానా అవస్థలు పడుతున్నారు. ఏడాదైనా వేతనాలు రాని సందర్భాలు కూడా ఉన్నాయి. దీంతో కుటుంబ పోషణ భారంగా మారుతోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 24వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్నారు.

ఆదర్శ పాఠశాలల్లో..

ఉమ్మడి జిల్లాలోని ఆదర్శ (మోడల్) పాఠశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఏడు నెలలుగా వేతనాలు రావడం లేదు. ఒక్కో పాఠశాలలో నలుగురు పొరుగు సేవల సిబ్బంది పని చేస్తున్నారు. కంప్యూటర్ ఆపరేటర్, ఫిజికల్ డైరెక్టర్, అటెండర్, వాచ్‌మెన్ వీరిలో ఉన్నారు. వీరికి ఇచ్చే వేతనమే తక్కువ. అది కూడా నెలనెలా అందడం లేదు. ప్రతీ ఆర్థిక సంవత్సరం ముగింపు సమయంలో నూతన ఏజెన్సీకి అప్పగించడమో, నిధుల కొరతతో ఒకటీ రెండు నెలలు ఆలస్యం కావడం సహజమే. ఈ ఏడాది ఏడు నెలలైనా ఉద్యోగుల ఖాతాల్లో జీతాలు జమ కాలేదు. ఏడు నెలలుగా జీతాలు రాక ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. విధులు బహిష్కరిస్తామంటూ ఇప్పటికే పాఠశాలల నిర్వాహకులకు వినతి పత్రాలు అందజేసి గత సోమవారం గైర్హాజరయ్యారు. ఒక్కో పాఠశాలలో 700 మంది విద్యార్థులు ఉండగా వీరి సమ్మెతో విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది. పాఠశాల కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడనున్నది. వీరికి వేతనాలు చెల్లించడంలో జాప్యానికి కారణం ఏజెన్సీలను సకాలంలో రెన్యూవల్ చేయకపోవడమేనని తెలుస్తోంది.

పంచాయతీరాజ్‌లో..

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి కొన్ని నెలలుగా వేతనాలు అందడం లేదు. గ్రామ పంచాయతీల్లో ఓపీఎస్ (అవుట్ సోర్సింగ్ పంచాయతీ సెక్రెటరీలు)గా పని చేస్తున్న వారికి అయిదారు నెలలుగా వేతనాలు అందడం లేదు. వివిధ జిల్లాల్లో పంచాయతీ కార్యదర్శులు పోస్టులు ఖాళీగా ఉన్నచోట్ల 2020-21 నుంచి ఓపీఎస్‌లను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నెలకు రూ.18వేల జీతంతో నియమించారు. ఏ జిల్లాకు ఆ జిల్లా ఓ ఏజెన్సీద్వారా వీరి నియామకాలు చేపట్టారు. అయితే కొన్నిచోట్ల ప్రతీనెలా వేతనాలు చెల్లించే పరిస్థితులు ఉండడం లేదు. ఉమ్మడి జిల్లాలో సుమారు 300 మంది ఓపీఎస్‌లు ఇబ్బందులు పడుతున్నారు. గ్రీన్‌చానల్ ద్వారా వేతనాలు ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో అది అమలుకు నోచుకోవడం లేదు. ఏ ఏడాదికి ఆ ఏడాది ఓపీఎస్‌ల కాంట్రాక్టు రెన్యూవల్ చేయకపోవడంతో వారు ఇబ్బందలు పడుతున్నారు.

రెగ్యులర్ ఉద్యోగుల రాకతో..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వరుసగా (మిగతా 8వ పేజీలో)

ఎస్సీ గురుకులాల్లో..

ఎస్సీ సంక్షేమ గురుకుల సొసైటీల్లో పనిచేస్తున్న పొరుగు సేవల సిబ్బంది పరిస్థితి ఇలాగే ఉంది. ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సీ సంక్షేమ గురుకులాల్లో పొరుగు సేవల కింద పనిచేస్తున్న ఉపాధ్యాయులకు నెలనెలా వేతనాలు అందడం లేదు. ప్రస్తుతం నాలుగు నెలల వేతనాలు బకాయిలు ఉన్నాయి. గెస్ట్ ఫ్యాకల్టీకి మూడు నెలల నుంచి వేతనాలు రాలేదు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిపై పని చేస్తున్న పారిశుధ్య సిబ్బందికి మూడు నాలుగుల నెలలుగా వేతనాలు లేవు. ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. అయిదారు నెలలు వేతనాలు పెండింగ్‌లో ఉంటే ప్రతీసారి అందులో ఒకటీ రెండు నెలలయే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. వేతనాల అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఆస్పత్రుల ఎదుట నిరసన ప్రదర్శనలు జరిపిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

సాట్‌లోనూ..

సొసైటీ ఫర్ ఆడిట్ అకౌంటబులిటీ అండ్ ట్రాన్స్‌పరెన్సీ (సాట్)లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. వీరికి నాలుగైదు నెలలుగా జీతాలు అందడం లేదు. ప్రతీసారి ఇదే తంతు అని ఉద్యోగులు వాపోతున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి ఎన్ని సార్లు తీసుకువెళ్లినా పరిస్థితిలో మార్పురాలేదని వాపోతున్నారు.

సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నాడని..

- కిడ్నాప్ చేసి యువకుడి దారుణ హత్య
- బాసిత్ హత్య కేసులో వీడిన మిస్టరీ



బాసిత్ (ఫైల్)

వివరాలు : 6 పేజీలో...

గ్రామీణ సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

భూపాలపల్లి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

కాటారం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అధికారులు, కార్యదర్శులు గ్రామీణ సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని మద్దులపల్లి, కొత్తపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాలను ఆమె శనివారం సందర్శించారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. కార్యదర్శుల పనితీరును, పల్లె ప్రగతి పనులు, ప్లాంటేషన్లను పరిశీలించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి విద్య, మధ్యాహ్నభోజనం అందిస్తున్న తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు ఇచ్చారు. ఆమె వెంట ఎంపీడీవో బాబు, ఎఫ్ఆర్వో స్వాతి, ఎంపీవో వీరస్వామి, పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్, జ్యోత్స్న తదితరులు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

లంబాడీల 'చలో వరంగల్' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లంబాడీ జేఏసీ నాయకులు

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న నిర్వహించనున్న లంబాడీ జేఏసీ 'చలో వరంగల్' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లంబాడీ హక్కుల జాయింట్ యాక్షన్ కమిటీ ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త జాటోత్ కిషన్‌నాయక్ మాట్లాడుతూ తెలంగాణలో కోయ, గోండులకు చెందిన కొంతమంది స్వార్థ రాజకీయ నాయకులు తమ పలుకుబడితో లంబాడీ జాతిపై వివక్ష చూపుతున్నారని విమర్శించారు. లంబాడీలు అసలు గిరిజనులే కాదంటూ చిచ్చుపెట్టి అశాంతిని చెలరేగేలా దుశ్చర్యలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. తమను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే కుట్ర పన్నుతున్నారని అన్నారు. అలా జరిగితే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తే ఊరుకునేది లేదని అన్నారు. చలో వరంగల్ సభను విజయవంతం చేయడానికి వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు మాలోతు నవరామ్, భూక్య సురేష్, శ్రీనివాస్, రాజేందర్, కిషన్, సంతోష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కాళేశ్వరాలయంలో ద్వారబంధనం

మహదేవపూర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం ద్వారబంధనం నిర్వహించనున్నారు. చంద్రగ్రహణం నేపథ్యంలో ఉదయం 12 గంటలకు ఆలయం ద్వారాన్ని మూసివేయనున్నారు. ఈమేరకు దేవస్థానం ఈవో మహేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి సోమవారం సంప్రోక్షణాది పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఉదయం 7.30 గంటలకు భక్తులకు దర్శనానికి అనుమతించనున్నట్టు తెలిపారు.

'మేడిగడ్డ'కు 4.51లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. 4.51లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 85గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 5.70 మీటర్లు నమోదైంది.

యూరియా లారీని అడ్డుకున్న రైతులు

మల్హర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లారంలో శనివారం యూరియా లోడ్‌తో వచ్చిన లారీని రైతులు అడ్డుకున్నారు. తాడిచర్ల పీఏసీఎస్ కార్యాలయం వద్ద టోకెన్లు ఇస్తుండగా తమకు యూరియా అందడం లేదని సుమారు 200 మంది మల్లారం రైతులు నిరసనకు దిగారు. యూరియా లారీ తాడిచర్ల పీఏసీఎస్ కార్యాలయానికి వస్తుండగా మల్లారం సబ్‌స్టేషన్ వద్ద అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు, వ్యవసాయాధికారులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లారు. లారీని తాడిచర్ల పీఏసీఎస్ కార్యాలయం వద్దకు పంపించారు. సుమారు 200 మందికి తాడిచర్ల పీఏసీఎస్ కార్యాలయం నుంచి యూరియా పొందేందుకు మల్లారం జీపీలో టోకెన్లను అందించడంతో రైతులు శాంతించారు.

కుటుంబ సభ్యులు మందలించారని..

వివాహిత ఆత్మహత్య



స్వప్న (ఫైల్)

చిట్యాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సభ్యులు మందలించారనే మనస్తాపంతో పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నైన్‌పాక గ్రామానికి చెందిన మారేపల్లి స్వప్న (38) తన తమ్ముడి ఆరోగ్యం బాగా లేకపోవడంతో కొద్దిరోజులుగా ఆస్పత్రిలో ఉంటూ అతడి బాగోగులు చూసుకుంది. శుక్రవారం నైన్‌పాకలోని తన ఇంటికి తిరిగి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు ఆమెను మందలించారు. ఆస్పత్రిలో ఉండటం వల్ల వ్యవసాయ పనుల్లో ఆలస్యమైందని, కూలీలు కూడా దొరకలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మనస్తాపం చెందిన స్వప్న ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు ఆమెను స్థానికంగా ప్రథమ చికిత్స అందించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం చిట్యాల సామాజిక ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. మృతురాలికి భర్త మహేందర్, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రెవెన్యూ సిస్టమ్!



- ఇక గ్రామానికో జీపీవో
- వీఆర్వోలు, వీఆర్ఏల వ్యవస్థను రద్దు చేసిన గత ప్రభుత్వం
- ఊరటనిచ్చిన ప్రస్తుత సర్కారు
- కొత్త బాధ్యతల అప్పగింత
- గ్రామ పాలన అధికారులుగా నియామకం

కృష్ణకాలనీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ వ్యవస్థను గ్రామీణ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. భూసమస్యలను పరిష్కరించేందుకు నడుంకట్టింది. ఇందులో భాగంగా గ్రామానికో గ్రామ పాలన అధికారులు (జీపీవో) ఎంపికకు శ్రీకారం చుట్టింది. గతంలో ఉన్న రెవెన్యూ వ్యవస్థలోని వీఆర్వోలు, వీఆర్ఏలను అప్పటి బీఆర్ఎస్ సర్కారు ఐదేళ్ల క్రితం రద్దు చేసిన విషయం విదితమే. వారందరినీ అర్హతలనుబట్టి మునిసిపాలిటీ, డీఆర్‌డీవో, ఎంపీడీవో, డీఈవో, వ్యవసాయశాఖ, ఆర్డీవో తదితర శాఖలు, విభాగాల్లో సర్దుబాటు చేసింది. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు మళ్లీ వారిలోనే ప్రతిభావంతులను గుర్తించి జీపీవోలుగా ఎంపిక చేసింది. సర్కారు తీసుకున్న ఈ నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

రెవెన్యూ వ్యవస్థలో భూసమస్యల పరిష్కారార్థం వీఆర్వోలు, వీఆర్ఏలు కీలకంగా పని చేశారు. ఈ క్రమంలోనే వారిపై పలు అవినీతి, ఆరోపణలు సైతం వెల్లువెత్తాయి. దీంతో గత బీఆర్ఎస్ సర్కారు 2020 సెప్టెంబరు 7న వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేసింది. వారందరినీ అర్హతలనుబట్టి వివిధ శాఖలు, విభాగాల్లో జూనియర్ అసిస్టెంట్లుగా సర్దుబాటు చేసింది. ఇన్నాళ్లు వారంతా ఆయా శాఖల్లోనే విధులు నిర్వర్తిస్తూ వస్తున్నారు. అయితే.. రెవెన్యూ పరమైన విధుల్లో ఆరితేరిన వీఆర్వోలు, వీఆర్ఏలు ఆయా శాఖల్లో విధులు నిర్వర్తించడం ఒకింత కష్టతరంగా భావించుకుంటూ వచ్చారు. ఎట్టకేలకు కాంగ్రెస్ సర్కారు వారికి ఊరట కలిగించింది.

జిల్లాలో 107 మంది ఎంపిక

రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేయడంపై కాంగ్రెస్ సర్కారు దృష్టి పెట్టిన నేపథ్యంలో వీఆర్వోలు, వీఆర్ఏలుగా పని చేసిన వారిని అర్హతలనుబట్టీ జీపీవోలుగా ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో భూపాలపల్లి జిల్లా నుంచి 107 మంది ఎంపికయ్యారు. గతంలో జిల్లా వ్యాప్తంగా 81 మంది వీఆర్వోలు, 204 మంది వీఆర్ఏలు పనిచేసినట్టు లెక్కలు చెబుతున్నాయి. అయితే.. (మిగతా 8వ పేజీలో)

సమర్థంగా పనిచేస్తాం..

- కృష్ణమూర్తి, పాత వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు



అనాలోచిత నిర్ణయంతో వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను గత ప్రభుత్వం రద్దు చేసింది. కొత్తగా ఏర్పడిన ప్రజాప్రభుత్వం మళ్లీ రెవెన్యూలోకి మమ్ములను తీసుకోవడం హర్షించదగ్గ విషయం. ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాం. ప్రజలకు అందుబాటులో ఉంటూ సకాలంలో అన్ని రకాల సేవలు సమర్థం అందించేందుకు కృషి చేస్తాం.

పొలానికి నీరు పెడుతుండగా..

విద్యుదాఘాతంతో రైతు మృతి

కురవి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కురవి మండలం స్టేషన్ గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన ఆలేటి సాయికుమార్(33) అనే రైతు శనివారం ఉదయం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... సాయికుమార్‌కు 1.10 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో వరిపంట సాగు చేశాడు. పొలానికి నీరు పెట్టేందుకు మోటార్‌ను ఆన్ చేయగా.. విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు సాయికుమార్‌ను ద్విచక్ర వాహనంపై మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని తెలిపారు. సాయికుమార్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సతీష్ పేర్కొన్నారు.

హైందవ పరిరక్షణకు కృషి చేయాలి



పులిహోర పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

తొర్రూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హైందవ ధర్మ పరిరక్షణకు యువత కృషి చేయాల్సిన అవసరం ఉందని వాసవీ క్లబ్ అధ్యక్షుడు చిదిరాల నవీన్‌కుమార్ అన్నారు. శనివారం తొర్రూరు పట్టణంలోని 10 వినాయక మండపాల వద్ద గత 9 రోజులుగా నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జరిగిన నిమజ్జనానికి పులిహోర ప్రసాద వితరణ కోసం పది క్వింటాళ్ల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాశ్చాత్య సంస్కృతి పెరుగుతున్న నేపథ్యంలో యువత హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేసి భక్తి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి సంవత్సరం గణపతి ఉత్సవాల నిర్వహణకు సహకారం అందిస్తున్నానని, మరింత సాకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఇమ్మడి రాంబాబు, నిరంజన్, సాయితేజ, మహేష్, నర్కుటి గజానంద్, గడల శ్రీను, వెంకన్న, ఏకాంతం, యాకన్న, కిరణ్ పాల్గొన్నారు.



WANTED
★ Wanted Typist's and PRO'S to work in a Reputed Diagnostic Center, Hanamakonda With Good Communication Skills. Cell.No: 9700288200, 9676042022, 9393113929
AJW-7680

WANTED
★ WANTED DELIVERY BOYS WITH OWN BIKE AND MOBILE, HANAMKONDA. CONTACT : 9849262529
AJW-243418

WANTED
★ Wanted To Teach Science (I-V), Pre-Primary English-2, H.S-PET, Tuitors-2 (Part Time. Standard H.S, Kashibugga, Wgl. Cell. No: 7680873344, 8522066699
AJW-6648

WANTED URGENT
★ Urgent Need Experienced Accountant & kitchen Supervisor for a Reputed Restaurant in Hanamkonda Cont: 9848092503 & 9133211897
AJW-6650

WANTED
★ Wanted Teachers To Teach Pre- Primary, Primary Eng, EVS, Maths, 6th to 10th Eng, Maths, Hindi, VP (Eng), P.E.T, Wardens F/M, tutors 4:30 to 7:30 pm, Watchman, Bus Facility available from Chinthal Bridge AVSHS, Dharmaram, Wgl. Cell.No: 9848672108, 9848181976
AJW-6649

WANTED
★ మడికొండ (ధర్మసాగర్) దగ్గరలో ఉన్న పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మంచి ఉత్సాహవంతులైన వర్కర్స్ కావలెను. సం॥ప్ర॥ 8247771016, 8247771525
AJW-7681

WANTED
★ బెల్లం చాయ్ షాపు (NIT) నందు పని చేయుటకు వర్కర్ కావలెను. ఉదయం 5 గం॥ నుండి సాయంత్రం 7:30 గం॥ వరకు జీతం: 10,000-12000. సం॥ప్ర॥ 9700871260
AJW-243147

WANTED
★ ప్రముఖ Pvt.Ltd, ISO సర్టిఫై ఉన్న కంపెనీ యందు మండలాల వారిగా మార్కెటింగ్ జాబ్స్ కలవు. అనుభవం మరియు ఆసక్తి గల వారికి ప్రాధాన్యత వయస్సు : 18సం॥ పైన జీతం: 10,000/- నుండి 30,000/- మరియు TA + DA. Cell.No: 9989884506
AJW-243149

WANTED
★ హన్మకొండ కుమార్‌పల్లిలో 5సం॥ల నుండి రన్నింగ్‌లో గల అన్లైన్ ఫుడ్ డెలివరీ ఫాస్ట్‌ఫుడ్ షాపు లీజ్ / సేల్‌కి కలదు. మరియు HNK చౌరస్తాలోని న్యూ శ్రీనివాస్ బార్ & రెస్టారెంట్‌లో వెయిటర్ & క్యాంటీన్ నడుపుటకు వర్కర్స్ కావలెను. సం॥ప్ర॥ 8686163213, 9182832959
AJW-243137

WANTED
★ బీటీస్ లైఫ్ హాస్పిటల్‌లో పని చేయుటకు PRO's ఫార్మసిస్ట్ మరియు (రిసెప్షనిస్ట్, కంప్యూటర్ నాలెడ్జ్ ఉన్నవారు 9am to 9 pm.Only లేడీస్ మాత్రమే కావలెను.) కాకాజీ కాలని, హన్మకొండ. సం॥ప్ర॥ 9032753764
AJW-243417

WANTED
★ గుడ్‌ఫ్రైడే-క్రైస్తవ సమాధి పేట్టెలు-డైమన్స్, డేకోలం బీడింగ్ + స్టీల్ కేసింగ్ తో చేయబడును. డోర్ డెలవరి సౌకర్యం కలదు. జడ్సన్- 9866585995, 8555919781. గొర్రెకుంట క్రాస్, వరంగల్.
AJH-003452

BUSINESS OFFER
★ రూ:2 లక్షల డిపాజిట్ తో మీ ఏరియాల్లో "శ్రీ విజయలక్ష్మి పికిల్ స్టోర్" ని ప్రారంభించి షాపులో కూర్చుని బిజినెస్ చేస్తూ ప్రతి నెల 30 వేలు సాలరీ మరియు బిజినెస్ పై 30% మార్జిన్ పొందండి. సెల్: 8143909459
AJM-13956

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

PLOT FOR SALE
★ వేగంగా అభివృద్ధి చెందుతున్న GWMC వరంగల్ NH 163 (200 Ft). PROPOSED : 300 Ft రింగ్ రోడ్డు ఫేసింగ్, రాంపూర్ టీటీట్ వెంచర్ D.P.No. 3006/2023 లో ప్లాట్స్ కలవు. కావలసిన వారు సం॥ప్ర॥ 9010005556
AJW-243138

PLOT FOR SALE
★ North Facing 150 Sqyds (30X45) located in TNGO'S KUDA Layout, 50 Meters from Kakatiya University Bypass Road surrounded by Houses. Cell.No: 9573886955, 9849732480
AJW-243421

PLOT FOR SALE
★ 300 గజాలు, East Facing, LRS Total Paid, Single Room with H.No: 28-5-474/2, చుట్టూ కాంపౌండ్ వాల్ With Gate సాయికృప కాలని రెడ్డిపురం ప్రాపర్టీ అమ్మకానికి కలదు. సం॥ప్ర॥ 9395561655
AJW-243148

FLATS FOR SALE
★ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్ SPR స్కూల్‌కు దగ్గరలో Stilt plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సం॥ప్ర॥ 7660008666, 8309035091
AJW-27937

TO-LET
★ #1-7-1589 శ్రీనివాస నగర్, కాళోజీ కళాక్షేత్రం వెనకాల, హనుమాన్ గుడి ఎదురుగా 3rd ఫ్లోర్ 2BHK for family, 24/7 Water & అన్ని వసతులతో ఇల్లు కిరాయికి ఇవ్వబడును. Rent 6,500/-. Cell.No: 9395561655.
AJW-243122

TO - LET
★ TOLET 2-BHK Near Hanmakonda Mandal Office 8am-8pm Cell.No : 9390100118
AJW-243419

LEASE / SALE
★ హన్మకొండ కుమార్‌పల్లిలో 5సం॥ల నుండి రన్నింగ్‌లో గల అన్లైన్ ఫుడ్ డెలివరీ ఫాస్ట్‌ఫుడ్ షాపు లీజ్ / సేల్‌కి కలదు. మరియు HNK చౌరస్తాలోని న్యూ శ్రీనివాస్ బార్ & రెస్టారెంట్‌లో వెయిటర్ & క్యాంటీన్ నడుపుటకు వర్కర్స్ కావలెను. సం॥ప్ర॥ 8686163213, 9182832959
AJW-243137

TO - LET
★ కొత్తగా నిర్మించిన DNL రెసిడెన్షియల్ 3rd Floor లో 2BHK అద్దెకు ఇవ్వబడును. Govt Employeesకు ప్రాధాన్యత, కారు పార్కింగ్ సౌకర్యం కలదు. దేశాయిపేట రోడ్, టీచర్స్ కాలనీ, వరంగల్ సంప్ర సెల్ : 94407 21207
AJK-238646

శ్రీరాజరాజేశ్వర హోమియా క్లినిక్
★ సంతానం కావాలా ? హోమియో వైద్య చికిత్సకై సంప్ర॥ 36 సం॥ల BHMS డా॥ CH. జితేందర్ BHMS శ్రీరాజరాజేశ్వర హోమియా క్లినిక్ Opp: న్యూ బస్టాండ్. హన్మకొండ. సం॥ప్ర॥ 9849117394
AJW-7676

ఎలర్జీ వ్యాధులు సతాయిస్తున్నాయా
★ నిరంతరం చర్మం,దురద రావడం తరుచుగా తుమ్ములు రావడం, కళ్ళలో మంటగా ఉంటె సంప్ర॥ డా॥ పావుశెట్టి శ్రీధర్, హోమియో ఫిజీషియన్, న్యూబస్టాండ్, బాలసముద్రం రోడ్, ఫైర్ స్టేషన్ ఎదురుగా హన్మకొండ. సం॥ప్ర॥ 9959638214
AJW-7677

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ
9985400013
8978510273
9985411677
వరంగల్
9949638376
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9949638376
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232

'ఇన్‌స్పైర్'పై నో ఇంట్రెస్ట్

- విద్యార్థుల్లో పెరుగుతున్న అనాసక్తి
- ములుగు జిల్లా అంతంత మాత్రంగానే దరఖాస్తులు
- గడువు ముగియనున్నా పట్టించుకోని వైనం
- 112 పాఠశాలల్లో 28 శాతం మాత్రమే అర్జీలు

ములుగు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో మేధాశక్తిని పెంచాలనే సర్కారు లక్ష్యం నీరుగారిపోతోంది. ఇన్‌స్పైర్ కార్యక్రమంపై విద్యార్థుల్లో అనాసక్తి పెరుగుతోంది. దరఖాస్తు చేసుకోవడానికి గడువు ముగింపు దశకు చేరుకున్న ఇంకా వందలాది మంది అందుకు మొగ్గుచూపడం లేదని తెలుస్తోంది.విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసి వారిని ప్రోత్సహించడంతోపాటు శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడమే ఇన్‌స్పైర్ లక్ష్యం.

ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వం నేషన్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ద్వారా ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమాన్ని చేపడుతోంది. ఆరు నుంచి పదో తరగతి చదివే ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలల విద్యార్థులతో పాటు గురుకులాల, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్ తదితర పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఇందులో పాల్గొనవచ్చు. ములుగు జిల్లా విద్యార్థులు ఇందుకు అంతగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. దీంతో కేంద్ర ప్రభుత్వం నుంచి లభించే స్కాలర్‌షిప్‌లు, రీసెర్చ్ అవకాశాలు వృథా అవుతున్నాయని, దీంతో భవిష్యత్ తరాలు సైన్స్ పట్ల నిరాసక్తి చూపుతారేమోనని విద్యాతేత్తలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అర్హతలున్నా వెనకడుగు

ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసెర్చ్ (ఇన్‌స్పైర్) కార్యక్రమానికి ఒక్కో పాఠశాల నుంచి ఐదుగురు అర్హులైన విద్యార్థులను ఎంపిక చేయాలనే నిబంధన ఉంది. ఈ క్రమంలో ములుగు జిల్లాలో 112 పాఠశాలల్లో 560 మంది విద్యార్థులు అర్హులుగా ఉన్నారు. దరఖాస్తు ప్రక్రియ జూన్ 15 నుంచి ప్రారంభమైంది. మూడు నెలలవుతున్నా ఇప్పటి వరకు 29 పాఠశాలల నుంచి 157 మంది విద్యార్థులు మాత్రమే అప్లయ్ చేసుకున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఇది మొత్తం అర్హుల సంఖ్యలో 28 శాతం మాత్రమే. మిగిలిన 83 పాఠశాలల విద్యార్థులు ఈ ప్రక్రియలో పాల్గొనకపోవడం, ఈ సదావకాశాన్ని పట్టించుకోక పోవడంపై దిగ్భ్రాంతి వ్యక్తమవుతోంది. విద్యార్థులు సోషల్‌మీడియా, డిజిటల్ గేమ్‌లలో మునిగిపోయి ఇలాంటి కీలక అవకాశాలను విస్మరిస్తున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది.

విద్యావేత్తల్లో ఆందోళన

ఇన్‌స్పైర్‌లో ఎంపికైన విద్యార్థులకు వారి ప్రాజెక్టుల తయారీ కోసం ప్రభుత్వం రూ. 10వేలు అందిస్తుంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ. 25 వేల బహుమతి ప్రదానం చేస్తుంది. జిల్లాలోని విద్యార్థులకు ఇన్‌స్పైర్ కార్యక్రమంపై ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో వారు నిరాసక్తి కనబరుస్తున్నారని తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ పథకంపై సరైన అవగాహన లేకపోవడం ఈ సమస్య మరింత తీవ్రంగా మారిందని చెప్పవచ్చు. పలు పాఠశాలల నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల కేంద్ర ప్రభుత్వం లక్ష్యం నీరుగారిపోతోందని, అలాగే ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో విద్యార్థులకు ఈ పథకం పట్ల అవగాహన కల్పించకపోవడంతో దేశానికి భవిష్యత్ సైంటిస్టులను కోల్పోతున్నామని విద్యావేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్‌స్పైర్‌లో పాల్గొనేందుకు ఈనెల 15 వరకే చివరి గడువు. అయినా అంతంత మాత్రంగానే దరఖాస్తులు రావడం ఆందోళన కలిగిస్తోంది.

జీఎస్టీ రద్దుతో సామాన్య ప్రజలకు లబ్ధి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కొన్ని వస్తువులపై వస్తు సేవల పన్ను(జీఎస్టీ) రద్దు, మరికొన్నింటిపై తగ్గింపు చేయడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు అన్నారు. మహబూబాబాద్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలకు మేలు జరిగేలా జీఎస్టీ తగ్గించడం చరిత్రాత్మక నిర్ణయమని చెప్పారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ప్రధాని మోదీ వన్ నేషన్, వన్ ట్యాక్స్ లాంటి సంస్కరణలు తీసుకువచ్చారని పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసర సరుకుల ధరలు తగ్గనున్నాయని తద్వారా పేదలకే మేలు జరగనుందన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూ వేలం పాట నిర్వహించగా జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్ రూ.20,501లకు దక్కించుకున్నారని చెప్పారు. అనంతరం వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో గడ్డం అశోక్, గుగులోతు మదన్, పొదిల్ల నర్సింహారెడ్డి, ఓర్సు పద్మావతి, సతీష్, దారా ఇందుభారతి, సందీప్, రాధా పటేల్, కాంతమ్మ, వెన్నమల్ల అజయ్, రమేష్, జహేందర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బైక్‌ను ఢీకొన్న కారు..

ఇద్దరికి గాయాలు

కాటారం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరు పంచాయతీ కార్మికులు గాయపడిన సంఘటన భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని జాతీయ రహదారి 353(సీ)పై శనివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం గ్రామ పంచాయతీ కార్మికులు తోట శేఖర్, పాడి సత్యంరాజు బైక్‌పై మహదేవపూర్‌కు బయల్దేరారు. అదే సమయంలో భూపాలపల్లి మండలంలోని గడ్డిగానిపల్లికి చెందిన వ్యక్తులు కారులో మహదేవపూర్ వెళ్తున్నారు. సబ్‌స్టేషన్‌పల్లి సమీపంలో బైక్‌ను వెనకనుంచి కారు ఢీకొనడంతో శేఖర్ కాలు రెండు చోట్ల విరిగి తీవ్ర గాయాలయ్యాయి. సత్యంరాజుకు కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108అంబులెన్స్‌లో భూపాలపల్లి 100పడకల ఆస్పత్రికి తరలించారు.

లంబాడీలు, ఆదివాసీల మధ్య చిచ్చు పెట్టేందుకు కుట్రలు

బీఆర్ఎస్, బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తున్నాయి

యూరియా విషయంలో ఆందోళన వద్దు

మానుకోట ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లంబాడీలు, ఆదివాసీలకు మధ్య చిచ్చు పెట్టేందుకు కొంత మంది కుట్రలు పన్నుతున్నారని, వాటిని తిప్పికొట్టాలని మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటున్న ఆదివాసీ, లంబాడీల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మహబూబాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. భద్రాచలం, ఉట్నూరులో బీఈడీ కళాశాలలు మంజూరీ అయ్యాయని, దాని విషయంలో ఆదివాసీ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి మాట్లాడారని చెప్పారు. దానిని వక్రీకరించి లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని వారు కోరినట్లుగా సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. స్వయాన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 5న లంబాడీ ఎంపీ, ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారని, 1976లో లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చింది మాజీ ప్రధాని ఇందిరాగాంధీ అని, అలాంటి కాంగ్రెస్ పార్టీ ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను ఎలా తొలగిస్తారని, తొలగించే ప్రసక్తే లేదని చెప్పారని వివరించారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని 2016లో నాడు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఎంపీ సోయం బాబురావు హైకోర్టులో కేసు వేస్తే దానిని కొట్టి వేయగా సుప్రీంకోర్టుకు వెళ్లారని, వారితో కూడా మాట్లాడి ఆ కేసును ఉపసంహరించుకునేలా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు.

యూరియా విషయంలో ఆందోళన వద్దు..

యూరియా విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని, ప్రతి రైతుకు యూరియా అందుతుందని స్థానిక ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. యూరియా కొరత ఒక్క తెలంగాణలోనే కాదని, అన్ని రాష్ట్రాల్లో ఉందని, నాగార్జున యూరియా మేనేజ్‌మెంట్ మారడం, రామగుండంలో పరిశ్రమ దెబ్బతినడం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, చైనా నుంచి దిగుమతి కాకపోవడం లాంటి కారణాలతో యూరియా కొరత ఏర్పడిందని చెప్పారు. కేంద్రం నుంచి 8లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 5లక్షల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. మిగతాది కూడా త్వరలో రానుందని, అందరికి యూరియా అందుతుందని చెప్పారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నీరుటి లక్ష్మీనారాయణ, ఖలీల్‌పాషా, బానోత్ ప్రసాద్, ఎడ్ల రమేష్, నల్వాది దిలీప్, ప్రభాకర్, బాలాజీ, చంటి, పాషా, శ్రీను, సిద్ధు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

వెంకటాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): లంబాడీలను ఎటీస్ట జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ డిమాండ్ చేశారు. ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో శనివారం జరగ్గా ముఖ్య అతిథిగా సతీష్ హాజరయ్యారు. లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల ఆదివాసీలకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. ఆదివాసీలకు దక్కాల్సిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను లంబాడీలు లాక్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు కృష్ణబాబు, శంకర్, నాగరాజు, రఘు, రాజుకుమార్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరాలయంలో ఈఎన్‌సీ పూజలు



ఈఎన్‌సీని సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

మహదేవపూర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ నంగునూరి అశోక్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికగా స్వామివారికి అభిషేకం చేశారు. పార్వతీ శుభానంద దేవి అమ్మవారి ఆలయంలో పూజల అనంతరం అర్చక స్వాములు, వేద పండితులు స్వామివారి శేష వస్త్రాలతో వారిని సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నాడని..

● కిడ్నాప్ చేసి యువకుడి దారుణ హత్య ●ఆరుగురు నిందితుల అరెస్టు ● భూపాలపల్లిలో బాసిత్ హత్య కేసులో వీడిన మిస్టరీ



నిందితుల అరెస్టును చూపుతున్న డీఎస్పీ సంపత్‌రావు

కృష్ణకాలనీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో మేడారం అడవుల్లో శుక్రవారం వెలుగు చూసిన యువకుడి హత్య కేసును భూపాలపల్లి పోలీసులు ఛేదించారు. ఆరుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. తమకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నాడనే కోపంతో ఆ యువకుడిని కిడ్నాప్ చేసి కత్తితో పొడిచి హత్య చేశారని, ఆపై పెట్రోల్ పోసి నిప్పంటించారని గుర్తించారు. భూపాలపల్లి డీఎస్పీ అవిర్నేని సంపత్‌రావు తన చాంబర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధి రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన ఎం.డి.బాసిత్ (20)తో శాంతినగర్ కాలనీకి చెందిన రడపాక భాస్కర్ అలియాస్ బబ్లూ, బుస్స ప్రశాంత్ అలియాస్ సోను, గాజుల కుషాల్ అనే యువకులకు గొడవలు ఉన్నాయి. రెండు నెలల క్రితం బస్టాండ్ ఎదురుగా వీరు ఓ విషయంలో వాగ్వాదం చేసుకున్నారు. ఆ సమయంలో బాసిత్ అసభ్యకరంగా మాట్లాడాడని ఆ యువకులు అతడిని చితకబాదారు. దీంతో బాసిత్ వారిపై కక్ష పెట్టుకుని సోషల్ మీడియాలో హేట్ మేసేజ్‌లు పెట్టడం మొదలెట్టాడు. ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లో అసభ్యకర పదజాలంతో వారికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టడమేకాకుండా నేరుగా మేసేజ్ రూపంలో రెచ్చగొట్టే విధంగా వారికి పంపేవాడు. దీంతో కోపోద్రిక్తులైన ముగ్గురు బాసిత్‌ను అంతమొందించాలని పథకం రచించారు. తమ మరో ముగ్గురు స్నేహితులు పందిళ్ల శ్రవణ్, బరిగల ప్రణయ్, చొప్పరి నవీన్‌తో కలిసి మర్డర్‌కు ప్లాన్ చేశారు. ఈ నెల 4న తన మిత్రుడు అరుణ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై బాసిత్ వస్తుండగా ఆరుగురు కారులో వచ్చి అతడిని ఆపి కొట్టారు. ఆపై కారులో ఎక్కించుకొని కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు.

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవుల్లోకి తీసుకెళ్లి విచక్షణ రహితంగా కొట్టి చేతులు వెనక్కి కట్టేసి కత్తితో పొడిచారు. చనిపోయాడని నిర్ధారించుకున్నాక తమ వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ని పోసి నిప్పటించి పరారయ్యారు. ఈ నేపథ్యంలో ఈనెల 5న మృతదేహాన్ని తాడ్వాయి పోలీసులు గుర్తించారు. అప్పటికే కిడ్నాప్ కేసు భూపాలపల్లిలో నమోదై ఉన్న నేపథ్యంలో అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో మృతుడితో కిడ్నాప్ రోజు ఉన్న అతడి స్నేహితుడు చెప్పిన వివరాలు, సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించిన భూపాలపల్లి పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. నేరాన్ని వారు అంగీకరించడంతో రిమాండ్‌కు తరలించారు.

అరెస్టు అయిన వారిలో భూపాలపల్లి పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన రడపాక భాస్కర్ అలియాస్ బబ్లూ, బుస్స ప్రశాంత్ అలియాస్ సోను, గాజుల కుషాల్, టీటూ క్వార్టర్స్‌కు చెందిన పందిళ్ల శ్రవణ్ అలియాస్ పవన్, యాదవకాలనీకి చెందిన బరిగల ప్రణయ్, సుభాష్‌కాలనీకి చెందిన చొప్పరి నవీన్ ఉన్నారని డీఎస్పీ వివరించారు. విలేకరుల సమావేశంలో సీఐ నరేష్‌కుమార్, ఎస్సైలు సాంబమూర్తి, రమేష్‌లు పాల్గొన్నారు. మృతుడు బాసిత్ ఏపనీ చేయకుండా తిరిగేవాడని, అతడిపై పలు గంజాయి, చైన్‌స్నాచింగ్ కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

ఎస్సార్‌యూకు ఆల్ ఇండియా 91వ ర్యాంకు

- ఎన్ఐఆర్ఎఫ్ కేటగిరిలో కైవసం
- ఎస్సార్‌యూ చాన్స్‌లర్ వరదారెడ్డి వెల్లడి

హసన్‌పర్తి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయం మరోసారి తన ప్రతిభను చాటుకుందని ఎస్సార్ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ ఎనగందుల వరదారెడ్డి తెలిపారు. మండలంలోని అనంతసాగర్ ఎస్సార్‌యూలో శనివారం ఎస్సార్‌యూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వరదారెడ్డి వివరాలను వెల్లడించారు. ఇటీవల విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ 2025ను విడుదల చేశారని తెలిపారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ (ఎంఓఈ) ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)-2025లో ఇంజనీరింగ్ కేటగిరిలో 91వ ర్యాంకు, యూనివర్సిటీ కేటగిరిలో 101- 150 బ్యాండ్లో స్థానం సంపాదించడం గర్వకారణమన్నారు. తెలంగాణలోని ప్రైవేటు సంస్థలలో ఇంజనీరింగ్ కేటగిరిలో టాప్ 100లో స్థానం పొందిన ఏకైక సంస్థ ఎస్సార్‌యూ మాత్రమేనని అన్నారు. వరుసగా నాలుగో సంవత్సరం ఈ ప్రతిష్మాత్మక ర్యాంకు దక్కించుకోవడంలో విశ్వవిద్యాలయ అధ్యాపక బృందం, విద్యార్థుల కృషి మరువలేనిదన్నారు.

వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్‌లో టాప్ 100లో చోటు దక్కించుకోవడం ద్వారా విద్యా నాణ్యత, పరిశోధన ఆవిష్కరణలపై ఎస్సార్ విశ్వవిద్యాలయం పట్టును మరోసారి రుజువు చేసుకుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రైవేటు విశ్వవిద్యాలయాల మధ్య ఎస్సార్ విశ్వవిద్యాలయం అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఇన్నోవేషన్, క్రియేటివిటీ, ఎంటర్ ప్రిన్యూర్‌షిప్ విలువలను పాఠ్యాంశంలో భాగంగా చేసుకోవడంతో పాటు అధ్యాపక బృందం, సమర్థవంతమైన పరిశోధన ఫలితంగా 5000 ప్లస్, పరిశోధన పత్రాలు, 1000 ప్లస్ పేటెంట్లు, 50 ప్లస్ పేటెంట్లు పొందినట్లు తెలిపారు. 50 ప్లస్ పరిశోధన ప్రాజెక్టుల ద్వారా రూ.15 కోట్ల నిధులు అలాగే మైక్రోసాఫ్ట్ నుంచి 51 ఎల్‌పీఏ వంటి అత్యుత్తమ ప్లేస్‌మెంట్ అవకాశాలు సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ వి.మహేష్, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.అర్చనారెడ్డి, వివిధ స్కూల్స్ డీన్స్, వివిధ విభాగాల హెడ్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సార్ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ వరదారెడ్డి



రామప్ప ఆలయ గార్డెన్‌లో వ్యర్థాలు

రామప్ప గార్డెన్‌లో చెత్తాచెదారం

వెంకటాపూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ గార్డెన్‌లో చెత్తాచెదారం దర్శనమిస్తోంది. ప్రపంచ దేశాల నుంచి పర్యటకులు వస్తున్నప్పటికీ శుభ్రత విషయంలో ఇక్కడ శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్ల రామప్ప గార్డెన్ ప్లాస్టిక్ వ్యర్థాలతో శనివారం ఉదయం దర్శనమిచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి పొందిన ఆలయం పట్ల అధికారులు ఇలా నిర్లక్ష్యం వహిస్తున్నారని పర్యాటకులు విమర్శిస్తున్నారు. శోభాయమానంగా వెలుగొందాల్సిన రామప్ప దేవాయ గార్డెన్ చెత్తతో దర్శనమివ్వడమేమిటని ప్రశ్నిస్తున్నారు.

ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనోత్సవం

● రెండో రోజు కూడా కొనసాగిన వేడుక ● తరలివచ్చిన భారీ విగ్రహాలు ● చిన్నవడ్డెపల్లి, ఉర్సు, బెస్తం చెరువుల వద్ద అధికారుల వైఫల్యం
● మొదటి రోజు అర్ధరాత్రి వరకే కనిపించిన వైనం మొరాయించిన క్రేన్లు.. లోతు లేక నీటమునగని విగ్రహాలు



ఉర్సు చెరువు వద్ద ఒడ్డునే నిమజ్జనాలు చేసిన గణపతి విగ్రహాలు



చిన్నవడ్డెపల్లికి ట్రాక్టర్లపై పెద్ద ఎత్తున నిమజ్జనానికి తరలివస్తున్న వినాయక విగ్రహాలు



చిన్న వడ్డెపల్లి చెరువుకు తరలుతున్న భారీ విగ్రహం

పోచమ్మమైదాన్(వరంగల్), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా ముగిసాయి. శుక్రవారం ఉదయం ప్రారంభమైన నిమజ్జన వేడుకలు శనివారం సాయంత్రం వరకు కొనసాగాయి. గణేష్ ఉత్సవ నిర్వాహకులు చాల ఆలస్యంగా రోడ్ల పైకి వచ్చారు. దీంతో అర్థరాత్రి వరకు నిమజ్జన వేడుకలు నిమ్మదిగా సాగాయి. ఇదిలావుండగా, వరంగల్ దేశాయిపేటలోని చిన్న వడ్డెపల్లి చెరువులో అర్ధరాత్రి 1 గంట వరకు సుమారుగా 800లోపు మాత్రమే విగ్రహాల నిమజ్జనం జరిగింది. కాగా అర్ధరాత్రి రెండు గంటల తరువాత అధికశాతం విగ్రహాలు నిమజ్జనానికి బయలు దేరి వచ్చాయి. దీంతో రెండవ రోజు సాయంత్రం వరకు వినాయక నిమజ్జనం నిర్విరామంగా కొనసాగింది. శనివారం ఉదయం వేళలో నిమజ్జనానికి వచ్చిన విగ్రహాల వాహనాలు సుమారు మూడు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. దీంతో పోలీసులు వాహనాలను క్రమపద్దతిలో చెరువు వద్దకు చేరవేశారు.

చిన్నవడ్డెపల్లి చెరువులో రెండు రోజులు జరిగిన కార్యక్రమంలో చిన్న విగ్రహాలు 500, మీడియం సైజు విగ్రహాలు 400, బారీ విగ్రహాలు 700 వరకు నిమజ్జనమైయ్యాయని, మొత్తంగా సుమారు 1600 విగ్రహాల నిమజ్జనం జరిగినట్లు అధికారులు తెలిపారు. అధికశాతం విగ్రహాలు ఆలస్యంగా బయలు దేరడం, కొన్ని మండపాల నిర్వాహకులు ఉదయం బయలుదేరడంతో రెండవ రోజు సాయంత్రం వరకు వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగింది. మధ్యాహ్నం మూడు గంటల తరువాత క్రేన్ ఆపరేటర్లు అందుబాటులో లేకపోవడంతో పలువురు మండపాల నిర్వాహకులు నేరుగా విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేశారు. కాగా సాయంత్రం వేళలో భారీ విగ్రహాలు నిమజ్జనానికి రావడంతో మళ్లీ క్రేన్‌లతో నిమజ్జనం చేశారు.

కొరవడిన పర్యవేక్షణ....

వినాయక నిమజ్జన వేడుకలలో అర్ధరాత్రి దాటిన తరువాత పూర్తి స్థాయిలో అధికారుల పర్యావేక్షణ కొనసాగలేదు. అధికారులు కనబడకపోవడంతో సిబ్బంది చేతుల మీదుగానే నిమజ్జన ప్రక్రియ కొనసాగినట్లు పలువురు తెలిపారు. తెల్లవారుజాము నుంచి అధిక శాతం విగ్రహాలు నిమజ్జనానికి రావడంతో కొంత ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయి. కేవలం పోలీసు సిబ్బంది మాత్రమే విధుల్లో ఉండటంతో నిమజ్జనం చేసే క్రేన్‌ల వద్ద విగ్రహాల వాహనాలు భారీగా మోహరించాయి.

చేతులేత్తేసిన సిబ్బంది...

కరీమాబాద్(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉర్సు గుట్ట చెరువు వద్ద శుక్రవారం రాత్రి నిర్వహించిన గణపతి నిమజ్జనాల్లో సిబ్బంది పూర్తిగా విఫలమయ్యారు. శుక్రవారం రాత్రి 11 గంటల వరకు సుమారు 600పైగా విగ్రహాల వరకు సాఫీగా సాగిన నిమజ్జనాలు ఆ తరువాత గతి తప్పాయి. నిమజ్జనాల కోసం ఏర్పాటు చేసిన మూడు క్రేన్‌లు మొరాయించడంతో విగ్రహాలను చెరువులోకి తరలించడం కష్టతరం కావడంతో సిబ్బంది చెరువులోకి తెప్పలు వెళ్లడం కష్టమని విగ్రహాలను ఒడ్డున ఉన్న ఫ్లాట్‌ఫాం దగ్గరే నిమజ్జనం చేశారు. దీంతో విగ్రహాలు సగం వరకే నీటిలో మునిగిపోయాయి. ఆ తరువాత వచ్చే విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేసేందుకు వీలు లేకపోవడంతో భక్తులకు, సిబ్బందికి మధ్య కాసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. ఒక్కో గణపతి విగ్రహం నిమజ్జనం చేసేందుకు గ్రేటర్ సిబ్బంది రూ.500 డిమాండ్ చేసినట్లుతెలిసింది. నిమజ్జనాల ఏర్పాట్లలో జీడబ్ల్యూఎంసీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపణలు వచ్చాయి. నిమజ్జనాలు గతి తప్పిన విషయంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. శనివారం సాయంత్రం కూడా నిమజ్జనాలకు గణపతి విగ్రహాలు తరలివచ్చాయి. కాని చెరువు ప్రాంతంలో కేవలం ఒకే ఒక్క క్రేన్ అందుబాటులో ఉండగా, సిబ్బంది ఎవరూ కనిపించలేదు.



నిమజ్జనానికి సిద్ధంగా ఉన్న గణపతి

బెస్తం చెరువు వద్ద అదే పరిస్థితి...

శంభునిపేట (ఆంధ్రజ్యోతి): రంగశాయిపేట నాయుడు పెట్రోల్ పంప్ సమీపంలోని బెస్తం చెరువులో నిమజ్జన ఏర్పాట్లు చేయడంలో అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారు. నిమజ్జనం కోసం నాలుగు రోజుల క్రితం చెరువులో నామమత్రంగా పూడిక తీసారు. సుమారు 250 విగ్రహాలు నిమజ్జనం చేసే చెరువులో ఆ స్థాయిలో పనులు చేయలేకపోయారు. దీంతో లోతు లేక విగ్రహాలు నీట మునగలేదు. ఈ క్రమంలో గణనాథులను క్రేన్ నుంచి దింపి తెప్పలలో 30 మీటర్ల దూరం వరకు లోతున్న ప్రాంతానికి తీసుకెళ్ళి నిమజ్జనం చేయాల్సి వచ్చింది. దీంతో చెరువు వద్ద నుండి ఖమ్మం రోడ్ వరకు విగ్రహాలు గంటల కొద్దీ బారులు తీరాయి. కొన్ని పెద్ద విగ్రహాలను చెరువు పక్కనే నిమజ్జనం చేయగా అవి మునగకపోవటంతో ఆయా మండళ్ల బాధ్యులు ఇరిగేషన్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. మామునూరు ఎస్ఐ శ్రీకాంత్ సముదాయించి నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చూశారు.

ఘనంగా ఆంధ్రజ్యోతి గణపతి నిమజ్జన వేడుక



ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో వినాయక నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న ఆంధ్రజ్యోతి బృందం

మడికొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నవరాత్రులు ఘనంగా పూజలందుకున్న విఘ్న వినాయకుడిని ఆంధ్రజ్యోతి సిబ్బంది శుక్రవారం రాత్రి ఘనంగా సాగనంపారు. మడికొండలోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్ వి.రఘుపతిరావు ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది వినాయక నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది 18వ సారి కావడం విశేషం. శుక్రవారం రాత్రి స్వామి వారికి ఉద్వాసన పూజను భక్తిపాటలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్‌మేనేజర్ వివిధ విభాగాల ఇన్‌చార్జిలను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. సంస్థ పురోభివృద్ధితో పాటు, సిబ్బంది సంక్షేమం కాంక్షిస్తూ వినాయక నవరాత్రులు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఉత్సాహంగా సాగిన వేలం పాటలో లడ్డూను ప్రొడక్షన్ విభాగం రీజనల్ మేనేజర్ బి.అజయ్‌కుమార్ దక్కించుకున్నారు. అనంతరం ఆటపాటలతో ఊరేగింపు నిర్వహించి శనివారం తెల్లవారుజామున మడికొండ శివారులోని చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎడిషన్ ఇన్‌చార్జి శంకర్‌రావు శెంకేసి, యాడ్స్ మేనేజర్ రమేశ్, సర్క్యులేషన్ ఇన్‌చార్జి షరీఫ్, అకౌంటెంట్ ఎస్.వెంకటేశ్, స్టోర్స్ రవి, ప్రొడక్షన్ నుంచి విజయ్, షెడ్యూలింగ్ కాయల వేణయ్య, హెచ్‌ఆర్ రాజేందర్, సబ్ ఎడిటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శివనగర్‌లో లడ్డూ వేలం పాట
రూ.1.36 లక్షలు

ఖిలావరంగల్, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): వరంగల్ శివనగర్‌కు చెందిన మెరుగు అశోక్ రూ.1,36,500కు వేలంలో వినాయక లడ్డూ దక్కించుకున్నారు. 34వ డివిజన్ శివనగర్‌లో రాక్‌స్టార్ ఏర్పాటు చేసిన లడ్డూకు శుక్రవారం రాత్రి వేలం పాట నిర్వహించగా అశోక్ అత్యధిక పాటపాడి కైవసం చేసుకున్నారు. ఆయనకు వాస్తు వేదాంతి సుమన్‌శర్మ లడ్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో రాక్‌స్టార్ యూత్ సభ్యులు అంకతి అఖిల్, నలివేల మహేష్, పిన్నిరెడ్డి ప్రణీత్‌రెడ్డి, గుండెపు శివ, ఏకాంబరం మనస్విత్, ముప్పార పాకిల్, నిఖిల్, గూడురు రాజేష్, సంతోష్, సాత్విక్, అరవింద్, కిట్టు, స్థానిక పెద్దలు దిడ్డి రాజేందర్, కోటి నారాయణ, అచ్చ రవి, బేతి శ్రీకివాస్ తదితరులు పాల్గొన్నారు.



వేలంపాటలో లడ్డును పొందిన మెరుగు అశోక్





నిమజ్జనాన్ని తిలకిస్తున్న భక్తులు, ఫైర్ ఇంజన్‌తో గణపతిపై నీళ్లు చిమ్ముతున్న దృశ్యం

భారీ గణనాధుడికి జన నీరాజనం

ప్రతిష్ఠించిన చోటే నిమజ్జనం చేసిన నిర్వాహకులు

5గంటల పాటు కొనసాగిన వేడుకలు

మట్టివాడ సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎల్లంబజార్ ప్రాంతంలో ప్రతిష్ఠించిన 45 అడుగుల ఎత్తైన భారీ మట్టి వినాయకుడిని శనివారం ప్రతిష్ఠించిన చోటే నిమజ్జనం చేశారు. ఫైర్‌ఇంజన్ ట్యాంకర్, మున్సిపల్ వాటర్ ట్యాంకు నీళ్ళను విగ్రహంపై చిమ్మి నిమజ్జనం చేశారు. దీనికి దాదాపు ఐదు గంటల సమయం పట్టింది. దీంతో క్రమక్రమంగా మట్టి కరిగిపోయింది. నిమజ్జనాన్ని చూసేందుకు భక్తులు తరలివచ్చారు.

-రూ.3.26 లక్షల పలికిన లడ్డూ వేలం..

వరంగల్ ఎల్లంబజార్‌లో ఆకుతోట సంజు ప్రతిష్ఠించిన 45 అడుగుల ఎత్తైన భారీ గణనాధుని వద్ద ఏర్పాటు చేసిన లడ్డూను హంటర్‌రోడ్డుకు చెందిన బత్తిని సమత రమేశ్ దంపతులు దక్కించుకున్నారు. వేలం పాటలో పాల్గొని రూ. 3.26 లక్షలకు లడ్డూను గెలుచుకున్నారు.

మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన నిమజ్జనం ప్రక్రియ సుమారు 5గంటలకు పైగా సాగింది. 200 లీటర్ల పాలు, 20 వేల లీటర్ల నీళ్ళు, 50కిలోల పసుపు, 50 కిలోల కుంకుమ, 30కిలోల పెరుగు, 80 కేజీల గులాబీ పూలతో నిమజ్జనం చేపట్టారు. వరంగల్ జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీధర్‌రెడ్డి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నవీన్‌ల ఆధ్వర్యంలో ఫైర్‌సిబ్బంది ట్యాంకర్ పైపుల సహాయంతో విగ్రహంపైకి నీళ్ళను చల్లి నిమజ్జనం చేశారు. నిమజ్జనం చేసిన మట్టిని భక్తులకు అందచేస్తామని నిర్వాహకుడు సంజు తెలిపారు.

10వేల పైచిలుకు విగ్రహాల నిమజ్జనం

● 36 గంటల పాటు శ్రమించిన బల్దియా సిబ్బంది
● జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని 22 చెరువుల వద్ద శనివారం మధ్యాహ్నం 2 గంటల వరకు 10వేలకు పైచిలుకు వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నగరంలో చాలాచోట్ల ఆలస్యంగా శోభయాత్రలు నిర్వహించడం వల్ల చిన్నవడ్డెపల్లి చెరువు వద్ద కొంత ఇబ్బంది ఏర్పడిందని తెలిపారు. అదనంగా సిబ్బందిని పిలిపించి ఆలస్యంగా వచ్చిన విగ్రహాలను నిమజ్జనం చేశామన్నారు. కిందటేడు 6,500 విగ్రహాలతో పోల్చుకుంటే.. ఈ యేడు విగ్రహాల సంఖ్య భారీగా పెరిగిందన్నారు. గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ అన్ని విభాగాలు చెరువుల వద్ద విస్తృత సేవలందించడం వల్ల నిమజ్జన కార్యక్రమం విజయవంతమైందని వెల్లడించారు. 36గంటల పాటు సిబ్బంది శ్రమకోర్చి సేవలందించారని కమిషనర్ ప్రశంసించారు. సిబ్బంది సేవలను గుర్తించి వారికి తగిన అవకాశాలు ఇస్తామని కమిషనర్ తెలిపారు.

నేడు కాళేశ్వర ఆలయం బంద్

మహదేవపూర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని మూసివేయనున్నారు. ఉదయం 12 గంటలకు ద్వార బంధనం చేసి తిరిగి సోమవారం సంప్రోక్షణాది పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈవో మహేష్ తెలిపారు. సోమవారం ఉదయం 7.30 గంటలకు భక్తులకు దర్శనానికి అనుమతించడం జరుగుతుందన్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీలోకి 4.51లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. కాగా బ్యారేజీ వద్ద నీటి మట్టం 5.70మీటర్లు ఎత్తులో ప్రవహిస్తుంది.

మా సార్‌ను ఎక్కడికి పంపొద్దు..

● ప్రిన్సిపాల్ డిప్యూటేషన్‌ను రద్దు చేయాలి ● మధ్యాహ్నం వరకు విద్యార్థినుల బైఠాయింపు
● కలెక్టర్ హామీతో శాంతించిన విద్యార్థినులు ● స్టేషన్‌ఘన్‌పూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఘటన

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమను తండ్రిలా, ఆదరిస్తూ, ఐదేళ్లుగా కంటికిరెప్పలా చూసుకుంటున్న ప్రిన్సిపాల్ ధరావత్ రాజును డిప్యూటేషన్‌పై పంపిస్తే పురుగుల మందు తాగుతామని, సార్ లేకుంటే మేం చదువుకోం టీసీలు ఇవ్వండి అంటూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన శనివారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చోటు చేసుకుంది. ఇటీవల పాఠశాల హాస్టల్‌లో ఉంటున్న ఓ టీచర్ విద్యార్థినులతో పాలు కాయించడం, అంట్లు తోమించడంతో పాటు, ప్రిన్సిపాల్ గదిలో విద్యార్థులను మోకాళ్ల పైన నిలబెట్టిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటనపైన అధికారులు విచారణ జరిపి ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌కు నివేదిక పంపించారు. నివేదిక మేరకు పీవో ప్రిన్సిపాల్ రాజును డిప్యూటేషన్ పై అరెపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలకు పంపించారు. దీంతో ప్రిన్సిపాల్ రాజు ఘన్‌పూర్ ఆశ్రమ పాఠశాలకు వచ్చి డిప్యూటేషన్ పై వెళ్తున్నట్టు ఉపాధ్యాయ బృందానికి తెలిపి వెళ్లిపోయారు. తర్వాత విషయం తెలుసుకున్న విద్యార్థులు కన్నీరుపెట్టుకున్నారు. ఈ క్రమంలోనే గేటు ఎదుట బైఠాయించారు. విద్యార్థులు రోడ్డు పైకి వెళ్లే ప్రయత్నం చేయగా సిబ్బంది గేటుకు తాళం వేశారు. దీంతో పాఠశాల ఆవరణలోనే గేటు వద్ద బైఠాయించి, మధ్యాహ్నం భోజనం టైం వరకు సార్‌ను పంపించొద్దు అంటూ నినాదాలు చేశారు. ఏ సమస్య వచ్చినా పరిష్కరించేవారని, సార్ వెళ్లితే తాము ఇక్కడ చదువమని, టీసీలు ఇస్తే వెళ్లిపోతామని విద్యార్థులు వెల్లడించారు. డిప్యూటేషన్ రద్దు చేయకుంటే పురుగుల మందు తాగుతామంటూ హెచ్చరించారు.

కలెక్టర్ హామీతో..

విషయం తెలుసుకున్న ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సీఐ వేణు, ఎస్సై వినయ్‌కుమార్‌లు పాఠశాలకు చేరుకుని విద్యార్థులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. నెల రోజుల్లో సార్‌ను తీసుకువచ్చేలా చూస్తామని పేర్కొన్నా వినలేదు. దీంతో ఆర్డీవో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడి ప్రిన్సిపాల్ డిప్యూటేషన్ తమ పరిధిలో లేదని, పీవోతో మాట్లాడి నెల రోజుల వ్యవధిలో తీసుకువచ్చేలా కృషి చేస్తామని విద్యార్థులకు తెలియపరుచాలని ఆర్డీవోకు తెలిపారు. దీంతో విద్యార్థులు శాంతించి, హాస్టల్‌కు వెళ్లి భోజనం చేశారు.



విద్యార్థినులకు నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్న అధికారులు

సర్కారు ఆఫీసుల్లో సౌర వెలుగులు

● ప్రతీ ఆఫీసు భవనంపై సోలార్ ప్యానెల్స్
● ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో సైతం..
● ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో సోలార్ పంపుసెట్లు
● కరెంట్ బిల్లులు తగ్గించే దిశగా చర్యలు
● ప్రభుత్వ కార్యాలయాలపై కొనసాగుతున్న సర్వే
● నివేదికలు అందగానే సౌర పలకల బిగింపు

హనుమకొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ జల, థర్మల్ విద్యుత్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి సౌర విద్యుత్తును అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామ పంచాయతీ భవనం నుంచి సచివాలయం వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే విషయమై ఇటీవల ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సోలార్ విద్యుత్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. సోలార్ పవర్ ప్లాంట్లపై కలెక్టర్లు పంపాల్సిన వివరాలతో ఒక ప్రశ్నావళిని రూపొందించారు. నీటిపారుదల శాఖ, రోడ్లు, భవనాల శాఖల పరిధిలో పెద్ద ఎత్తున ఉన్న ఖాళీ భూముల వివరాలను సైతం ప్రభుత్వం సేకరిస్తోంది. వీటిలో కూడా సౌర వ్యవస్థలను ఏర్పాటు చేస్తారు.

అన్ని ప్రభుత్వ భవనాలపై..

విద్యుత్పత్తిలో ఎదురవుతున్న సమస్యలు, ఆర్థిక నష్టాలు, డిస్కంలకు బిల్లుల చెల్లింపులు భారమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయలను అన్వేషిస్తోంది. ప్రైవేటుగా భవనాలపై సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకునేందుకు ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రాయితీలను కల్పిస్తున్నది తెలిసిందే. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ దిశగానే అడుగులు వేస్తోంది. దాదాపు ఇలాంటి పథకాన్నే అమలు చేయాలని నిర్ణయించింది. అయితే ఇది పూర్తిగా ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితమైన కార్యక్రమం. ప్రతీ ప్రభుత్వ కార్యాలయం భవనంపై సౌరపలకలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని సొంత భవనాలు కలిగిన అన్ని ప్రభుత్వ, ప్రభుత్వరంగ కార్యాయాల భవనాలపై వీటిని ఏర్పాటు చేయాలని పేర్కొన్నది. దీంతో తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్కో) అధికారుల పర్యవేక్షణలో సర్వే జరుగుతోంది. మండలాల్లో ఎంపీడీవోలు, ఎన్‌పీడీసీఎల్ ఏఈలు, మున్సిపాలిటీల పరిధిలో ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజనీర్లు, డిప్యూటీ కమిషనర్లు సర్వే జరుపుతున్నారు. వాస్తవానికి ఈ సర్వే గత నెల 18వ తేదీ నాటికే పూర్తి కావలసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా వర్షాలు కురుస్తుండడంతో సర్వే చేయడంలో జాప్యం జరుగుతోంది. రెండు మూడు రోజుల్లో సర్వే పూర్తి కావచ్చునని తెలుస్తోంది.



సమగ్రంగా సర్వే

పంచాయతీ భవనాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్ డిగ్రీ కళాశాలల భవనాలు, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, ఆస్పత్రులు, సాగునీటి ప్రాజెక్టు కార్యాలయాలు, కలెక్టరేట్ భవన సముదాయాలతో సహా ప్రతీ ప్రభుత్వ కార్యాలయంపై సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తారు. ఎన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఉన్నాయి? వాటి రూఫ్‌టాప్‌పై ఎన్ని కిలోవాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు, అందుకు ఎంత సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయవచ్చు? ఆ కార్యాలయానికి నెలకు ఎన్ని యూనిట్లు విద్యుత్ అవసరమవుతున్నది? ఎన్ని కిలోవాట్ల లోడ పడుతున్నది? తదితర వివరాలను సర్వే సందర్భంగా సేకరిస్తున్నారు. సర్వే పూర్తయిన తర్వాత నివేదికలను రెడ్కోకు అందజేస్తారు. రెడ్కో అధికారులు ఈ నివేదికలను పరిశీలించి ఎన్ని సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలి? ఎంత సౌరశక్తిని ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉంటుంది..? తదితర గణాంకాలతో ప్రతిపాదనలు రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తుంది. ప్రభుత్వం ఈ మేరకు ప్రతిపాదనలు ఆమోదించి బడ్జెట్ కేటాయిస్తే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తారు. డిసెంబర్ నెలాఖరునాటికి అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం.

అవసరాన్ని బట్టి ప్లాట్లు

తక్కువ విద్యుత్ వినియోగం ఉన్న కార్యాలయాలకు ఎల్‌టీ సర్వీస్ కింద, విద్యుత్ వినియోగం ఎక్కువగా వినియోగించే భవన సముదాయాలకు హెచ్‌టీ సర్వీస్ కింద సోలార్ ప్లాంట్లను బిగిస్తారు. ఉదాహరణకు ఒక గ్రామ పంచాయతీ కార్యాలయానికి నెలకు రూ.2వేల కరెంట్ బిల్లు వస్తుంది అనుకుంటే అందుకు ఎల్టీ సర్వీసు కింద 3-5 కిలోవాట్ల సామర్థ్యంతో కూడిన సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తారు. కలెక్టరేట్ సముదాయ భవనం, పెద్దాస్పత్రుల వంటి విశాలమైన భవనాలకు హెచ్‌టీ సర్వీసు కింద 100 కిలోవాట్లకు పైగా సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లను బిగిస్తారు.

సౌరగిరి జల వికాస పథకం

ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్ఓఎఫ్ఆర్ చట్టం కింద పంపిణీ చేసిన సుమారు 50వేల ఎకరాల్లో ఇందిర సౌరగిరి జల వికాస పథకం ద్వారా ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయనున్నారు. మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో వీటిని పంపిణీ చేయనున్నారు. అమ్మ ఆదర్శ కమిటీల కింద ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 130 ప్రభుత్వ పాఠశాలల భవనాలపై సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. మారుమూల పల్లె ప్రాంతాల్లోని కొన్ని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో సోలార్ హీటర్లను కూడా బిగించారు.


విద్యుత్ ఖర్చు ఆదా కోసమే..

ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బిల్లులు ప్రతీ నెల తడిసి మోపెడవుతున్నాయి. డిస్కమ్‌లకు ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ఈ బకాయిలు రూ.600కోట్ల వరకు ఉన్నాయి. కార్యాలయాల్లో సౌరవిద్యుత్ అందుబాటులోకి వస్తే బకాయిల భారం చాలా వరకు తగ్గుతుంది. ప్రభుత్వానికి ఈ డబ్బు ఆదా అవుతుంది.

ప్రభుత్వ కార్యాలయాల సర్వే జరుగుతున్నది..

గంగుల మహేందర్ రెడ్డి, జిల్లా మేనేజర్, టీజీ రెడ్కో

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు సర్వే జరుగుతోంది. ఎల్టీ, హెచ్‌టీ సర్వీసులు ఎన్ని ఉన్నాయి. ఎన్ని కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లు అవసరమో ప్రతిపాదనలు సమర్పించి ప్రభుత్వానికి అందజేస్తాం. బడ్జెట్ కేటాయింపు జరగ్గానే టెండర్ల పిలిచి పనులు చేపడతాం.



‘పరిషత్’ పోరుకు కసరత్తు



- ఓటర్ల జాబితాను విడుదల చేసిన అదనపు కలెక్టర్
- జడ్పీటీసీ 10, ఎంపీటీసీ 83 స్థానాలు
- పోలింగ్ కేంద్రాలు 473
- జిల్లాలో 2,29,159 మంది ఓటర్లు

ములుగు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల చివరి నాటికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు ముమ్మరం చేస్తోంది. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహిస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓటర్ల జాబితాతోపాటు పోలింగ్ కేంద్రాల ముసాయిదాను సీఈవో, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంపత్‌రావు శనివారం విడుదల చేశారు. ఇప్పటికే పంచాయతీలకు సంబంధించిన ఓటర్లు, పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ప్రకటించారు.

ఓటర్ల జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ముసాయిదాను విడుదల చేశారు. అలాగే ఈ నెల 8 నాటికి వీటికి సంబంధించిన అభ్యంతరాలను స్వీకరించనున్నారు. 8న కలెక్టర్ దివాకర స్థానిక రాజకీయ నేతలతో సమావేశాలు నిర్వహించనున్నారు. అలాగే ఎంపీడీవోలు మండల స్థాయి రాజకీయ నేతలతో సమావేశాలు నిర్వహించి అభ్యంతరాలను స్వీకరించనున్నారు. 9వ తేదీన అభ్యంతరాలు, సూచనల పరిష్కారం, 10న పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను ప్రకటిస్తారు.

జిల్లా వ్యాప్తంగా ఓటర్లు వీరే..

ములుగు జిల్లా వ్యాప్తంగా 2,29,159 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో 1,10,838 మంది పురుషులు, 1,18,299 మంది మహిళలు ఉండగా 22 మంది ఇతరులు ఉన్నట్లు తెలిపారు. అలాగే 10 జడ్పీ స్థానాలు, 83 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 473 పోలింగ్ కేంద్రాలను గుర్తించామని పేర్కొన్నారు. జిల్లాలో పురుష ఓటర్ల కంటే మహిళ ఓటర్లు అధికంగా ఉన్నారు.

మండలాల వారీగా స్థానాలు

ములుగు జిల్లాలో మండలాల వారీగా ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు ఇలా ఉన్నాయి... ఏటూరునాగారం మండలంలో ఒక జడ్పీటీసీ, 9 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 24,636 మంది ఓటర్లు ఉన్నారు. గోవిందరావుపేట మండలంలో ఒక జడ్పీటీసీ, 9 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 25,441 మంది ఓటర్లు ఉన్నారు. కన్నాయిగూడెం మండలంలో ఒక జడ్పీటీసీ, ఐదు ఎంపీటీసీ స్థానాలు ఉండగా 9,992 మంది ఓటర్లు ఉన్నారు. జేడీ మల్లంపల్లి మండలంలో ఒక జడ్పీటీసీ, ఐదు ఎంపీటీసీ స్థానాలు ఉండగా 13,507 మంది ఓటర్లు ఉన్నారు. మంగపేట మండలంలో ఒక జడ్పీటీసీ, 14 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 39,369 మంది ఓటర్లు ఉన్నారు. ములుగు మండలంలో ఒక జడ్పీటీసీ, 9 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 24,985 మంది ఓటర్లు ఉన్నారు. తాడ్వాయి మండలంలో ఒక జడ్పీటీసీ, 7 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 18,226 మంది ఓటర్లు ఉన్నారు. వెంకటాపూర్ మండలంలో ఒక జడ్పీటీసీ, 9 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 28,236 మంది ఓటర్లు ఉన్నారు. వెంకటాపురం మండలంలో ఒక జడ్పీటీసీ, 9 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 25,336 మంది ఓటర్లు ఉన్నారు. వాజేడు మండలంలో ఒక జడ్పీటీసీ, 7 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 19,431 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తంగా ములుగు జిల్లాలో 10 జెడ్పీటీసీ స్థానాలు, 83 ఎంపీటీసీ స్థానాలు, 2,29,159 మంది ఓటర్లు, పోలింగ్ స్టేషన్లు 473 ఉన్నట్లు జిల్లా అధికారులు ప్రకటించారు.

వేతనాలు రాక.. పూట గడవక..

(5వ పేజీ తరువాయి)

ఉద్యోగ నియామకలు చేపడుతోంది. ఇప్పటి వరకు 58వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసి 25 విభాగాల్లో నియామకాలు చేపట్టింది. ఈ నియామకాల్లో ఉపాధ్యాయులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు వంటి హోదాలు ఉన్నాయి. అయితే కొత్తగా నియమించిన రెగ్యులర్ ఉద్యోగులు రావడంతో పొరుగు సేవల ఉద్యోగులు ఎవరిని ఎలా నిర్వహించాలో ప్రశ్నార్థకంగా మారింది. తమ విషయంలో కఠినంగా వ్యవహరించొద్దని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కోరుతుండగా రెగ్యులర్ ఉద్యోగులు వచ్చాక వారెందుకని ప్రభుత్వం ఆలోచిస్తోంది. గ్రూప్-4 ద్వారా ఎంపికైన 8143 మంది జూనియర్ అసిస్టెంట్ల స్థానంలో అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఉద్యోగులను తొలగించనున్నారు. ఇప్పటికే ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖల పరిధిలో జూనియర్ అసిస్టెంట్లను భారీగా నియమించారు. దీంతో ఈ రెండు శాఖల్లో 150 మందిని తొలగించారు. పురపాలక శాఖ, రిజిస్ట్రేషన్ శాఖల్లోనూ సర్దుబాటు చేశారు. నిర్దిష్టమైన వేతన స్కేల్ లేని ఉద్యోగులందరినీ గౌరవ వేతనం కేటగిరీలో చూపుతారు. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ ఉద్యోగులు, మున్సిపల్, పంచాయతీల్లో పని చేసే కార్మికులు వీరిలో కొందరు. ఈ ఉద్యోగాలన్నీ గాలిలో దీపాలే. రెగ్యులర్ ఉద్యోగులు వస్తే వీరంతా ఇంటిబాట పట్టాల్సిందే.

ఏజెన్సీల అవతకవకలు

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియామకం చేసిన అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ సంస్థలు అవకతవకలకు పాల్పడుతున్నాయి. పొరుగు సేవల ఏజెన్సీలు కార్మికులు, సిబ్బంది పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు కోట్లాది రూపాయలను స్వాహా చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో పలు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల చేతివాటం రోజురోజుకూ ఎక్కువవుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. దీంతో కార్మికులకు ఉద్యోగ భద్రత కరువవుతోందని చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పారిశుధ్య పేషెంట్ కేర్, సెక్యూరిటీ తదితర సిబ్బంది అవుట్ సోర్సింగ్ కింద పని చేస్తున్నారు. అరేడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో వీరు పలుమార్లు ఆందోళనలు చేసినా ఫలితం లేదు. వేతనాలు రాక, పూడగడవని దయనీయ స్థితిని ఉద్యోగులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకునా ఏజెన్సీలే సొంతంగా జీతాలు చెల్లించాల్సి ఉంటుందని, నిధులు వచ్చాక సరి చూసుకోవాలనే నిబంధనలున్నాయని కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు. 2023 నుంచి పనిచేస్తున్నా వారి వేతనాలకు సంబంధించి పే స్లిప్పులు ఇవ్వడం లేదు.

నిధులువచ్చినా వేతనాలివ్వని ఏజెన్సీలు

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్రతీరోజు విధులు నిర్వర్తిస్తున్నారు. థర్డ్ పార్టీ ద్వారా నియమితులైన వీరు వేతనం కోసం తమను నియమించిన ఏజెన్సీ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి బతుకులీడ్వాల్సి వస్తోంది. వీరి వేతనాలను ప్రభుత్వం ఏజెన్సీ ఖాతాల్లో జమచేస్తే వారు కమిషన్ మినహాయించుకొని ఉద్యోగులకు వేతనాలను చెల్లిస్తారు. ప్రభుత్వం వేతనాలు మంజూరు చేసినా ఏజెన్సీ నుంచి వీరికి అందడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వమే బడ్జెట్ లేదన్న సాకుతో వేతనాలు ఇవ్వక తిప్పించుకుంటోంది. ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీరిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు వెలువరిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రారంభమై 5 నెలలు అవుతున్నా నాలుగు శాఖల సిబ్బంది మినహా మిగతా వారి సర్వీసును క్రమబద్ధీకరించలేదు. వేలాది మంది విధులు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తాము విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ ఉద్యోగంలో ఉన్నామా? లేదా అనే అయోమయానికి గురవుతున్నారు.

యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం : బీజేపీ

కృష్ణకాలనీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియా అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొంగల రాజేందర్ విమర్శించారు. భూపాలపల్లి మండలంలోని గొల్లబుద్దారం, దీక్షకుంట, దూదేకులపల్లి గ్రామాల్లో మండల అధ్యక్షుడు పులిగుజ్జ రాజు ఆధ్వర్యంలో పోలింగ్ బూత్ కమిటీలను శనివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేందర్ హాజరై మాట్లాడారు. బీజేపీని గ్రామ స్థాయి నుండి మరింత బలోపేతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వంద వైఖరి విడనాడి రైతులకు సకాలంలో యూరియా అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందాడి సత్తిరెడ్డి, బాల్య సంపత్, రఘురాం, అక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

కాటారం డివిజన్ నుంచి 32 మంది జీపీవోలు

కాటారం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాటారం డివిజన్ నుంచి 32మంది గ్రామ పరిపాలన అధికారులు ఎంపికయ్యారు. గత ప్రభుత్వం వీఆర్వో, వీఆర్ఏల వ్యవస్థను రద్దు చేసి ఇతర శాఖలకు పంపగా రెవెన్యూ గ్రామాల పరిధిలో భూ సమస్యల పరిష్కారం ఇబ్బందిగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణి స్థానంలో భూభారతి రెవెన్యూ చట్టం-2025ను రూపొందించడం విదితమే. దీనిలో భాగంగానే ప్రభుత్వం రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా ఏర్పాటు చేసి జీపీవో(గ్రామ పరిపాలన అధికారి)ను నియమించడానికి చర్యలు చేపట్టింది. తొలి విడతలో గతంలో వీఆర్వోలు, వీఆర్ఏలుగా పనిచేసిన వారిలో నుంచి సుముఖంగా ఉన్నవారికి జీపీవో అర్హత పరీక్షలు నిర్వహించగా ఎంపికైన వారికి సీఎం రేవంత్ రెడ్డి నియామక పత్రాలిచ్చారు. కాటారం డివిజన్‌లోని 5మండలాలకు చెందిన 32మంది జీపీవోలుగా ఎంపికవగా వారు పనిచేస్తున్న శాఖల నుంచి రిలీవ్ అయి జిల్లా కలెక్టరేట్‌లో రిపోర్ట్ చేశారు. వీరికి రెండు మూడు రోజుల్లో పోస్టింగులు ఇవ్వనున్నారు. కాటారం మండలం నుంచి 9మంది జీపీవోలు, మహదేవపూర్ నుంచి 9, మల్హర్‌రావు నుంచి 8, మహాముత్తారం మండలం నుంచి 6గురు జీపీవోలుగా ఎంపికైనట్లు అధికారులు తెలిపారు.

రెవె‘న్యూ’ సిస్టం!

(5వ పేజీ తరువాయి)

కాంగ్రెస్ సర్కారు వీరిలో 107 మందిని ఎంపిక చేయగా శుక్రవారం హైదరాబాద్ వేదికగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాల్ని అందుకున్నారు. జిల్లాలో 248 పంచాయతీలు ఉండగా ఒక్కో జీపీవోకు రెండేసి గ్రామాల బాధ్యతలను అప్పగించనున్నారని తెలుస్తోంది.

గ్రామాల్లో వీరే కీలకం...

నూతనంగా ఎంపికైన జీపీవోలు గ్రామ స్థాయిలో కీలకంగా పని చేసేలా ప్రభుత్వం పలు ఆదేశాలను జారీ చేసింది. ప్రధానంగా గ్రామాల్లో రికార్డుల నిర్వహణ, ఏదేని సరిఫ్టికెట్ల పరిశీలన, విచారణ, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టడం, చెరువులు, కుంటల రక్షించడం లాంటి బాధ్యతలను అప్పగించారు. అలాగే, భూములపై ఉన్న వివాదాల పరిష్కారానికి కృషి చేయడం, సంబంధిత సర్వేయర్లకు సహకరించడం వంటి విధులు కూడా వీరు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఇక ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో అర్హులైన వారిని గుర్తించడం, ఎన్నికల విధులు, ఉన్నతాధికారులు కేటాయించే బాధ్యతలు నిర్వర్తించడం విధులుగా నిర్ధారించారు.

రోడ్ల పరిస్థితి అధ్వానం : సీపీఎం

వెంకటాపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : మండలంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారిందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని యాకన్నగూడెం వద్ద పలు సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. అభివృద్ధి పనులకు పార్టీ మారానని గొప్పలు చెప్పిన ఎమ్మెల్యే ఆ దిశగా పనులు చేయడం లేదని విమర్శించారు. ఇసుక లారీలతో రోడ్లన్నీ పూర్తిగా ధ్వంసమైన వాటి మరమ్మతులపై ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, దీంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బీరెడ్డి, సాంబశివ, గ్యానం వాసు, కుమ్మరి శ్రీను, నర్సింహచారి, తోట నాగేశ్వరావు, శ్రీను, కృష్ణ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



కొంపల్లిలో మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వివిధ కారణాల వల్ల మృతి చెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శనివారం పరామర్శించారు. కొంపల్లి గ్రామంలో అనారోగ్యంతో వంగ లక్ష్మి మృతి చెందారు. అలాగే బోలవేని ఓదెలు, మల్కాపురం యాదగిరి, మూల లక్ష్మి గార్ల కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న పాతూరి రాజిరెడ్డిని ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



వాజేడులో విఘ్నేశ్వరుడి శోభాయాత్ర

వెంకటాపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : విఘ్నేశ్వరుడి నిమజ్జన కార్యక్రమంలో మండలంలో శనివారం కూడా వైభవంగా కొనసాగింది. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శోభాయాత్ర నడుమ నిమజ్జనం చేశారు. యువకులు, పెద్దలు, మహిళలు నృత్యాలు చేస్తూ కొనసాగించారు. అనంతరం మండలంలోని పాలెంవాగులో నిమజ్జనం చేశారు.

- వాజేడు (ఆంధ్రజ్యోతి): మండలంలో గణేషుడి నిమజ్జనాలు శనివారం ముగిసాయి. రెండు రోజుల పాటు జరిగిన నిమజ్జనాలు మండల వ్యాప్తంగా ఉన్న అన్ని విగ్రహాలను గోదావరి నదిలో నిమజ్జనాలు చేశారు. నిమజ్జనం సందర్భంగా ఊరేగింపు, నృత్యాలు, శోభాయాత్రలు ఆకట్టుకున్నాయి. నవరాత్రులు సందర్భంగా గణనాథుడు విశేషంగా పూజలు అందుకున్నాడు. చిన్నారులు, యువతి, యువకుల కేలాహలం మధ్య వైభవంగా నిమజ్జనాలు ఉత్సాహంగా సాగాయి. పూసూరు-ముళ్లెకట్ట వంతెన ఏర్పాటు చేసిన క్రేన్‌ల సాయంతో గోదావరిలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

మండల ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు



అవార్డు అందుకుంటున్న కేజీబీవీ గణితం టీచర్ శారద

వెంకటాపూర్, సెప్టెంబరు 6, (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసిన అధికారులు శనివారం అవార్డులు అంద జేశారు. కస్తూరిర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గణిత శాస్త్రం ఉపాధ్యాయురాలు భూక్య శారద, సామాన్య శాస్త్రం ఉపాధ్యాయురాలు గుగులోతు రజిత, జడ్పీఎస్ఎస్ లక్ష్మీదేవిపేట టీచర్ చంద్రశేఖర్, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణ, ఎంపీపీఎస్ నల్లగుంట హెడ్ మాస్టర్ శివరాం, నల్లగుంట హిందీ టీచర్ నజీమ్ అత్తర్, జడ్పీఎస్ఎస్ వెంకటాపూర్ టీచర్ అంబేద్కర్, జడ్పీఎస్ఎస్ నర్సాపూర్ టీచర్ జవహర్‌లాల్, జడ్పీఎస్ఎస్ పాలంపేట టీచర్ ఎడుకొండలు, ఎంపీపీఎస్ భూర్గుపేట టీచర్ పూర్ణిమ, ఎంపీపీఎస్ ఒడ్డెరిగూడెం టీచర్ విజయ భాస్కర్, ఎంపీపీఎస్ వెంకటేశ్వర్లపల్లి టీచర్ శ్రీనివాస్, ఎంపీపీఎస్ వెంకటాపూర్ టీచర్ చేన్నకేశవరావు, ఎంపీపీఎస్ వెంకటాపూర్ గర్ల్స్ టీచర్ జయప్రద, ఎంపీపీఎస్ పాంపేట టీచర్ శివరంజని, ఎంపీపీఎస్ వెల్తుర్లపల్లి టీచర్ నారాయణడ్డి ఎంపికాయ్యరు. వీరికి వెంకటాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఎంఈవో తాళ్లపల్లి ప్రభాకర్ చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధిక, ఉపాధ్యాయులు బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

మురికి గుంతలో పడి దుర్మరణం

మంగపేట, సెప్టెంబరు, 6 (ఆంధ్రజ్యోతి) మండలంలోని బ్రాహ్మణపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర గుంతలపడి ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన శనివారం వెలుగు చూసింది. ఎస్సై టీవీఆర్. సూరి తెలిపిన వివరాల ప్రకారం.. వాజేడు మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన గార అంజన్న (54) శుక్రవారం బ్రాహ్మణపల్లిలో వినాయక నిమజ్జనం కోసం బ్యాండ్ సన్నాయి కొట్టి వచ్చి అర్ధరాత్రి మద్యం మత్తులో ఉన్నాడు. ఈక్రమంలో రాత్రి బహిర్భూమికి పక్కనే గల ప్రదేశానికి వెళ్లాడు. మద్యం మత్తులో ప్రమాదవశత్తు కాలు జారి నీటి గుంతలో పడ్డాడు. నీరు లోతుగా ఉండటంతో ఊపిరాడక మృతి చెందాడు. ఈ విషయం తెలియక బ్యాండ్ సహచరులు ఇంటికి పోయి ఉంటాడని భావించి ధర్మారం గ్రామానికి వెళ్లిపోయారు. అక్కడ కూడా అంజన్న కనిపించలేదు. ఈ విషయంతో కుటుంబ సభ్యులు బ్రాహ్మణపల్లికి వచ్చి వెతికగా ఊరి చివర మురికి గుంతలో పడి శవమై కనిపించాడు.



అంజన్న మృతదేహం

చికిత్స పొందుతూ ఒకరి మృతి



బండి గోపి (ఫైల్)

భూపాలపల్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మొగుళ్లపల్లి మండలం పెద్ద కోమటిపల్లి గ్రామానికి చెందిన బండి గోపి (42) అనే వ్యక్తి పురుగుల మందు తాగాగ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం గోపి ఆర్థిక పరిస్థితుల కారణంతో గత మూడు ఏళ్ల నుంచి ఎలాంటి పని చేయకుండా కుటుంబాన్ని పోషించడం లేదన్నారు. జీవితంపై విరక్తి చెంది, మద్యానికి బానిసై ఇంట్లోనే ఉంటూ శుక్రవారం వ్యవసాయ పంట కోసం తెచ్చిన పురుగుల మందు మద్యం సేవించి మత్తులో పంట చేను వద్దకు వెళ్లి తాగడం జరిగిందన్నారు. గమనించిన రైతులు చికిత్స నిమిత్తం హన్మకొండ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం గోపి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు గోపి భార్య రజిత పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులున్నారు.

స్వేచ్ఛతోనే మహిళల ప్రగతి

- డీఎంహెచ్‌వో గోపాల్ రావు

ములుగు టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పనిచేసినప్పుడే ఆయా రంగాల్లో వారు రాణించి ప్రగతిని సాధించగలుగుతారని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు అన్నారు. మిషన్ శక్తిలో భాగంగా జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలో శనివారం ప్రారంభమైన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, పరిష్కార చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మహిళలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పని చేసినప్పుడే ఎక్కువ పని జరుగుతుందని, ఇది దేశ ప్రగతికి దోహదం చేస్తుం దని అన్నారు. లైంగిక వేధింపుల నివారణకు ప్రభుత్వాలు కృషి చేస్తు న్నా యన్నారు. ఇందులో భాగంగా రెండు కమిటీలు పనిచేస్తున్నాయని, మహిళలను ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటాయని తెలిపారు. ఈ సదస్సులో మిషన్ శక్తి జిల్లా కోఆర్డినేటర్ రమాదేవి, డెమో సంపత్, నర్సింగ్ కళాశాల టీచింగ్ ఫ్యాకల్టీ ప్రసన్న, సౌమ్య, మిషన్ శక్తి సిబ్బంది శిరీష, స్వప్న, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రవి చందర్ పరామర్శ

ములుగు రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ములుగు మండలం మదనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త దూడపాక మహేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ శనివారం పరామర్శించారు. క్వింటా బియ్యం, సరుకులు అందజేశారు. మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ ములుగు మండల అధ్యక్షుడు ఎం.డి.చాంద్ పాషా, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల భరత్ కుమార్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు జన్ను రవి, పార్టీ నాయకులు గండ్రత్ జయాకర్, మట్టెవాడ తిరుపతి, కుక్కల నాగరాజు, అభినయ చారి, లక్కీ, జన్ను రాజు, పోరిక రాజేందర్, ఉప్పరి రాజన్న, నేత సాగర్, ఎం.డి. సోఫి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపునకే టీఎల్ఎం మేళా

ఏటూరునాగారం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపునకే టీఎల్ఎం మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంఈవో కొయ్యడ మల్లయ్య అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులలో గణితం, భాషా సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు మండల స్థాయిలో టీఎల్ఎం(టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) 2025-మేళాను శనివారం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి(ఎంఈవో) మల్లయ్య హాజరై ప్రారంభించారు. అనంతరం మండలంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు తెలుగు, ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞానం వంటి సబ్జెక్టులను ప్రదర్శించారు. ఈ పోటీ ప్రదర్శనలో తెలుగు నుంచి ప్రథమ స్థానం డి. ప్రవళిక, ద్వితీయ స్థానం ఎస్. స్రవంతి, గణితం నుంచి ప్రథమ స్థానం ఎస్. స్రవంతి, ద్వితీయ స్థానం ఎ. రాజేందర్, ఆంగ్లం నుంచి ప్రథమ స్థానం పి. రాజశేఖర్, ద్వితీయ స్థానంలో బి. ప్రవీణ్‌లు గెలుపొందారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఉపాధ్యాయులు జిల్లా స్థాయి టీఎల్ఎం మేళాకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు మంచర్ల టీ.వీ వీరభద్రం, ఎస్కే లయిము, ప్రసాద్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

- కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పనపల్లి జడ్పీహెచ్ఎస్‌లో మండలస్థాయి టీఎల్ఎం మేళా నిర్వహించారు. మండ లంలోని అన్ని పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు హాజరయ్యారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా చార్టులను ప్రదర్శించారు. న్యాయ నిర్ణేతలు మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి సన్మానించారు. ఈ కార్యక్ర మంలో ఎంఈవో వాసం సాంబశివరావు, ఉపాధ్యాయులు వేణుగోపాల్, పర్వతాల సతీష్, వంగ పాపయ్య, బానోత్ కోటి, సురేందర్, రాజేంద్రాచారి పాల్గొన్నారు.

రైతులను తప్పుదోవ పట్టిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ : యూత్ కాంగ్రెస్

తాడ్వాయి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మేడారం జాతర పంట నష్టపరిహార సాధన సమితి పేరుతో బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు రైతులను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని యూత్ కాంగ్రెస్ మేడారం అధ్యక్షుడు రానా రమేష్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. రైతులకు అండగా ఉంటూ పంట రుణమాఫీ చేసింది కాంగ్రెస్ మాత్రమేనని గుర్తు చేశారు. ఈ పోరాటంలో ఇరు పార్టీల నాయకులే తప్ప నిజమైన రైతులు లేరని పేర్కొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

మంగపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిన నేపథ్యంలో బీజేపీ మండల అధ్యక్షుడు రావుల జానకీరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రధాని మోదీ చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. మంగపేట బీజేపీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్టీ మండల మాజీ అధ్యక్షుడు యర్రంకాని వీరన్‌కుమార్, బీజేవైఎం మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం. రవి, గుండాల రోహిత్‌కుమార్, ఇస్లావత్ శివకుమార్, మల్లారెడ్డి, బీజేపీ నాయకులు బడే జగన్మోహన్, బట్ట బాబురావు, కున్నం వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హేమాచలుడిని దర్శించుకున్న ఐటీడీఏ పీవో



ఐటీడీఏ పీవోను సత్కరిస్తున్న ఆలయ ఈవో మహేష్

మంగపేట, సెప్టెంబరు, 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా శనివారం సందర్శించారు. అర్చకులు, ఆలయ అధికారులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారితోపాటు అమ్మవార్లకు పూజలు చేసిన పీవోకు తీర్థప్రసాదాలు అందించారు. స్వామి వారి శేష వస్త్రాలతో ఈవో మహేష్ సత్కరించారు.

మృతుడి కుటుంబానికి చేయూత

తాడ్వాయి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటాపూర్ గ్రామానికి చెందిన చెట్టుపల్లి రాములు ఇటీవల అనారోగ్యంలో మృతి చెందాడు. అతడి కుమారులు సతీష్, వెంకన్న అదే గ్రామంలో తాపీ మేస్త్రీ పని చేసుకుండగా తోటి కార్మికులు రాములు దశదిన కర్మల ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. తాపీ మేస్త్రీ సంఘం నాయకులు ఎట్టి నరేష్, నామాని శంకర్, కనుమల్ల శ్రీను, పోడెం మల్లయ్య, మబ్బు నవీన్, సాయిరి శంకర్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...
దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !
పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.
సంప్రదించగలరు : జయశంకర్
Jayashankar Aco - 9985426984,
Bhupalpally SR - 8008795764
Mulugu SR - 9849245045, Eturunagaram
SR - 7673960447 ACM - 9985411664